
కథ

# అంతర్యామి

- వివిన మూర్తి

ఈనుపుల్లలా ఉంది రాధమ్మ చెయ్యి. దానితో అట్ల పుల్లని పట్టుకుని మూకుడులో బంగాళాదుంప ముక్కలను వేయిస్తోంది. డైబ్బై ఏళ్ళకి అటూ ఇటూగా ఉన్న ఆమె లక్ష్మీనారాయణ గురించి ఆలోచిస్తోంది.

అతను గడిచిన రాత్రి నుంచీ 'బంగాళా'–'వేపుడు' అంటున్నాడు. అంటూనోరు చప్పుడు చేస్తున్నాడు. ఏభై అయిదేళ్ళుగా ఆమెకి లక్ష్మీ నారాయణ ప్రతి కదలికా తెలుసు. ఆమె పుట్టి బుద్దెరిగినప్పటినుంచీ వింటోన్న సీత, సావిత్రి, అనసూయ, అరుంధతి వంటి వారి కథల నించే జీవిత నిర్వహణకు నమూనా లభించింది. ఆ నమూనాలలోనే ఆమె సకల ఉద్వేగాలూ ప్రదర్శితమయ్యాయి. ఇది ఆనందించవలసిందనీ ఇది బాధపడవలసిందనీ ఆమె అంతరంగాన్ని ప్రోగ్రామ్ చేసినవి ఆ నమూనాలే. ఆమెకి ప్రత్యేకమైన ప్రశ్నలు లేవు. ఏ ప్రశ్నలు కలగవచ్చో– కలిగితే ఏ జవాబులు ఇచ్చుకోవచ్చో కూడా ఆ నమూనాలే నిర్దేశించాయి. భర్త తనని నిర్లక్ష్యం చేసి, వేశ్యల చుట్టూ తిరిగితే దానికి ఎంతవరకూ ఎలా దుఃఖించాలో, దుఃఖించి, ఆ దుఃఖం నుంచి బయటపడటానికి ఏ వేదాంతాలను ఆశ్రయించాలో, ఏయే దేవతలను ప్రసన్నం చేసుకోవాలో



అవే నమూనాలు మార్గదర్శమయ్యాయి. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకో, వాళ్ల కష్టసుఖాలకో లక్ష్మీ నారాయణ తన జీవనాధారాలను కరిగించి వేస్తుంటే రేపెలా అన్న సహజమైన ప్రశ్న కలిగితే, దాన్నతని ముందు ఉంచితే, అదే ఓ తిరుగుబాటుగా అతను భావించితే, ఆ భావనతో ఆమెని శిక్షించటమే అతను స్వధర్మంగా ఎంచితే, అతనా స్వధర్మాన్ని నిర్వహించితే ఆమె దెబ్బలకు మందుకోసం ఆస్పత్రికి వెళ్ళింది గాని...సాయంకోసం పుట్టింటినీ, న్యాయం కోసం చట్టాన్నీ ఆశ్రయించలేదు.

ఇక మగవాడు కొడుకుగా ఎలా ప్రవర్తించాలో, అన్నగా ఎలా జీవించాలో, యజమానిగా కిందివాళ్ళను ఎలా వంచాలో, కుటుంబమనే గొడుగుకు ఎలా కర్రగా నిల్చోవాలో, సామాజిక బాధ్యతకూ సంసార ధర్మానికీ మధ్య సంఘర్షణ తలెత్తితే ఎటు పక్క నిలవాలో చూపించిన శ్రీరామ చంద్రుని నమూనా, భార్య పట్ల వ్యక్తిగా ఎలా ప్రవర్తించాలో మాత్రం చెప్పలేదు. ఆ దాంపత్యంలో భార్య విధేయతకి లభించిన ప్రచారం ముందు భర్తకి ఉండవలసిన కొద్దిపాటి ధర్మాలు కొట్టుకుపోవడంతో భారతీయ పురుషుడికి స్త్రీ విషయంలో దాదాపు నమూనా లేకుండాపోయింది. రాముడి ఏకపత్నీవ్రతం దైవసాధ్యమై, కృష్ణుని బహు స్త్రీ సంగమం మానవుని సహజ వయోధర్మమై పోయింది. దాంతో లక్ష్మీ నారాయణ ఎందరికి లాగానో తనకి సౌలభ్యంగా ఉన్న అంశాలను రాముడి నమూనా నుంచి స్వీకరించి భర్తగా రాధమ్మని పాలించాడు. అదే ప్రేమయితే ప్రేమించాడు. ధర్మం అదే అయితే దాన్ని తు.చ. తప్పకుండా పాటించాడు.

రాధమ్మకి అటువంటి సమస్య లేదు. ఆమెకి అనేకమంది పతివ్రతల నమూనాలున్నాయి. ఒకటికాకపోతే మరొకటయినా సందేహాలనించి గట్టెక్కించాయి. లక్ష్మీనారాయణ రాధమ్మల దాంపత్య సాఫల్యం ఆ కుటుంబాలలో విఖ్యాత మయింది. ఆ విఖ్యాతిలో సైతం లక్ష్మీనారాయణ సంసార నిర్వహణ సామర్థ్యానికి లభించిన మార్కుల ముందు రాధమ్మ నమూనాల పాలనల సామర్థ్యానికి లభించిన మార్కులు వెలవెల బోయాయి.

ఇంత నేపథ్యమున్న రాధమ్మకి ఆ బంగాళాదుంపల వేపుడు ఖాళీలో ఒక ప్రశ్న తలెత్తింది. ఆ ప్రశ్నకు ఆమె వాక్య స్వరూపం ఇవ్వలేకపోతోంది. అలా ఇచ్చే పనిలోమనసు నిమగ్నమైనప్పటికీ ఆమె దుంప ముక్కలను బొగ్గు ముక్కలను చేయలేదు. ముక్కలు సరిగ్గా కుదిరాయి. వేపుడు కారం జల్లింది. గొట్టు వచ్చి తగ్గింది.

తగ్గాక రాజు వచ్చాడు.

అమ్మ పక్కన నేలమీద చతికిలబడి ఆమె చేతిలోని అట్లకాడ తీసుకుని ఓ ముక్క గుచ్చి పైకి తీసి చేతిలో వేసుకుని చల్లార్చుతూ నోట్లో వేసుకుని,

'బాగుంది' అని-'ఇది నాన్నకి పడుతుందా?' అని అడిగాడు. దానికి రాధమ్మ సమాధానం ఇచ్చే లోగానే ప్రళయం మొదలైంది. రాజు పెద్ద కూతరు వినీత గందరగోళంగా వచ్చింది. వస్తూనే చెల్లెలి రౌడీయిజం గూర్చి ఫిర్యాదు ఆరంభించింది. 'జెటిక్స్' చానెల్ తను చూస్తోంది. రిమోట్ కూడా తన స్వాధీనంలో ఉంది. అయినప్పటికీ చెల్లెలు దాన్ని లాక్కుని 'పోగో' చానెల్ పెట్టేసుకుంది. నాన్నతో చెబుతాను అంటే చెప్పుకో అంది. సమస్య పరిష్కారానికి రాజు నడుం బిగించి ఆ గదిలో నడిచాడు.

వెళ్ళేసరికి సునీత పోగోని కూడా చూడటం లేదు. ఆ వేపు గది గుమ్మం వద్ద ఒంటిమీద నూలుపోగు లేకుండా నిలబడి వున్న లక్ష్మీనారాయణని చూస్తూ, ''తాతా షేమ్ షేమ్ పప్పీ షేమ్'' అంటోంది.

రాజు పరుగుపరుగున వెళ్ళి చొక్కా తీసుకువచ్చి తండ్రికి తొడుగుతున్నాడు.

క్రితం సారి వచ్చినపుడే రాజ్యం గట్టిగా చెప్పింది. ''పిల్లలని మాత్రం తీసుకువెళ్ళవద్దు. నాకే తలకొట్టేసినట్టు ఉంటుంది, కంపరం ఎత్తుతుంది. వాళ్ళు జడుసుకుంటారు.

ఎందుకు జడుసుకుంటారన్న ఎదురు పశ్న వేయకుండానే భార్య చెప్పిన మాటని అమలు చేస్తానన్నాడు రాజు. కాని చేయాలనుకోలేదు. చేయలేదు. తండ్రి అంటే అతనికి వల్లమాలిన ప్రేమ. భార్యని నిర్వహించడానికి తండ్రిని నమూనాగా తీసుకోవాలని రాజు కలలు కన్నాడు. రాజ్యం రాధమ్మలా సహకరించలేదు. ఆమె ఎదుగుతున్న సమయానికే పాత నమూనాలో శతాబ్దాలుగాపేరుకున్న లోపాలను గురించి సమాజం ఆలోచించసాగింది. కొత్త నమూనాలు ఏర్పడకపోయినా, ఆమె నష్టపోయిన స్త్రీ వర్గానికి చెందిందవటం వల్ల పెద్దగా విశ్లేషించకుండానే, సహజంగా ఆ ఆలోచనలను అంగీకరించేసింది. తన తండ్రి పట్ల తన భార్య మానవతా దృష్టిని కూడా ప్రదర్శించదని రాజు నిర్ణయానికి వచ్చేశాడు. నిత్యం ఉండే మనిషితో 'శాంతి' అతనికి ప్రధానం అయింది. 'అలాగే' అనడం, తోచింది చెయ్యడం ఒక్కోసారి పిల్లలనే అందుకు వాడటం రాజు అలవర్చుకున్నాడు. ''ఈ ఒక్కసారికే'' అని ఒట్లు వేసి పిల్లలను తీసుకువచ్చాడు.

తండ్రి గుర్తు పట్టే స్థితిలో లేడు. తల్లి చాకిరీ చేసే స్థితిలో లేదు. భార్య అంగీకరించే స్థితిలో లేదు. అందరికీ న్యాయం చెయ్యవలసిన పరిస్థితిలో చక్కబరచవలసిన స్థానంలో తను ఉన్నాడు.

తండ్రికి చొక్కా తొడిగి మంచం మీద కూర్చోబెట్టి ఏసీ సరిచేసి తలుపు దగ్గరగా వేసి పిల్లల దగ్గరకు వచ్చాడు. వాళ్ళని సర్ది అమ్మ వద్దకు వచ్చాడు తన లాప్‌టాప్‌తో.


''కన్నా'' అంది రాధమ్మ.

''ఏంటమ్మా'' అన్నాడు.

చెప్పడం మొదలెట్టింది రాధమ్మ.

* * *

లక్ష్మీ నారాయణకి ముగ్గురు చెల్లెళ్ళు. సావిత్రమ్మే పెద్దది. ఎర్రటి ఎరుపు. ఎరుపంటే చక్కదనమే ఆ రోజుల్లో. అయితే తింగరిది. ఆమెకి ఏం తెలుసో ఇతరులకి తెలియదు. తనికి ఏమి తెలియదో ఆమెకి తెలియదు. ఆమె తింగరితనం బాల్యంలో దాక్కుని ఉండగానే జనం గుర్తు పట్టకముందే పన్నెంటో ఏట పెళ్ళయింది. పెళ్ళికొడుకు ముఖముల్ అంగరఖా వేసుకుని సిల్కు టోపీ పెట్టుకుని చడావులు తొడుక్కుని గుమ్ము గుమ్ముగా ఉన్నాడు. వందెకరాలకి పట్టాదారుడని పెళ్ళి మాటలకొచ్చిన లక్ష్మీ



నారాయణకీ, వాళ్ళ పిన తండ్రికీ, ఎరువు తెచ్చిన వెండి కంచాల్లో నవకాయ పిండి వంటలతో భోజనాలు ఏర్పాటు చేసిన పెళ్ళికొడుకు పెత్తండ్రి కాస్తంత రొమ్ము విరుచుకుని చెప్పాడు. ఆ తర్వాత తెలిసింది పెళ్ళిచేస్తేనైనా పెళ్ళి కొడుకు దోవలో పడతాడని ఆ పెత్తండ్రి ఆశపడ్డాడని.

అలా ఆరంభమైంది సావిత్రమ్మ కాపురం. ఓ ఏడాది ఇంటి పట్టున ఉండి గర్భాదానం చేసి మరో రెండేళ్ళు దేశం మీదకి పోయే భర్తతో ఆమె ఆరుగురు బిడ్డలను ఎత్తింది. అదృష్టవంతురాలు, ఆ దిక్కుమాలిన ముండావాడు ఇంటిపట్టునే ఉంటే ఇరవై పురుళ్ళు పోసుకోవాల్సి వచ్చేది అన్నారు లెక్కలు తెలిసిన వాళ్ళు.

పోసుకున్నవి ఆరు పురుళ్ళయినా, గత జన్మలో గుమ్మడి పళ్ళ వ్రత లోపం వల్ల ఇద్దరే ఇద్దరు దక్కారు. ఆఖరి బిడ్డని ప్రసాదించి సశాస్త్రంగా బారసాల కూడా చేసి సావిత్రమ్మ మొగుడు మళ్ళీ కనబడలేదు.

సావిత్రమ్మ కాపురం అత్తారింట్లోనే గడిచిందీ అంటే దానికి కర్త ఆవిడ పెద్ద మరిది. కరణీకం చేస్తూ మూడు సంసారాలను లాగాడు. తన పిల్లలనీ, పారిపోయిన అన్న పిల్లలనీ, విధవ చెల్లెలి పిల్లల్నీ మొత్తం పదకొండు మందినీ ఒక్కలా చూసేవాడు. ఒంటి చేత్తో పెంచుకు వచ్చాడు. మండువాలో గడ్డి వేసి దాని మీద చిరిగిన కోకలూ పంచెలు పరిచి వరసాగ్గా పడుకోబెట్టేవాడు.

అలా సావిత్రమ్మ మరిది పిల్లలని పెంచినా, లక్ష్మీ నారాయణ వంతు అతనూ చేశాడు. మేనల్లుళ్ళని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ''ఎందుకు పెట్టుకోడు. కాళ్ళు పిసకడానికొకడు. పేకాడుతుంటే సిగరెట్టు పీకలు అందించడాని కొకడూను'' అనేది ఊరినుంచి వచ్చినప్పుడల్లా సావిత్రమ్మ. ఆడపడుచు అన్న మాట అర్థమైనప్పు డల్లా రాధమ్మ లబలబలాడేది. ఆ తింగరి పీనుగ అందిగదా అని మనం వదిలేస్తామా అని లక్ష్మీ నారాయణ రెండు తగిలించేవాడు.

ఇద్దరు మేనల్లుళ్ళలో ఒకడు సైకిలు రిపేరింగ్ నేర్చుకున్నాడు. పినతండ్రి నెత్తి మీద కూర్చుని తగువు పడి,అదొస్తుంది ఇదొస్తుందీ అనీ, అది మింగేశావు ఇది మింగేశావు అనీ, పిండుకోగలది పిండుకుని, పెట్టమన్న చోట సంతకాలు పెట్టి మైనారిటీ తీరని తమ్ముడిని మతి ఉండీ లేని తల్లినీ తీసుకుని కాకినాడ వచ్చేశాడు. కొన్నాళ్ళకు సైకిలు కొట్టు పెట్టుకుని మరి కొన్నాళ్ళకు అరడజను సైకిళ్ళు అద్దెకు తిప్పుతూ ఓ దోవన పడ్డాడు.

ఇంతచేసినా ఆ ధర్మాత్ముడు అన్న పిల్లలనీ వదిననీ వాళ్ళ కర్మానికి వాళ్ళని వదిలెయ్యలేదు. బొడ్డూడని గుంటడికి వెధవ బుద్ధులు నేర్పి పెట్టాడు మేనమామ అని విసుక్కున్నాడు గాని తమ్ముడినీ తల్లినీ అర్థాకలితో పస్తు పడుకోబెడు తున్నందుకు విలవిలలాడిపోయాడు. శ్యామల రావు వద్ద చేరిన చిన్న కొడుకుతో పాటు సావిత్రమ్మ కూడా వెళ్ళి చెప్పిన పని చేతనయినట్టు చేసి, ఇచ్చింది పుచ్చుకుని రొంటిన దోపుకునేది.

ఆ సొమ్మెంతో ఆవిడ కూడబలుక్కుని..లెక్కలు వేసుకుని..అన్న చేతిలో పెట్టేది. ''నా దగ్గరుంటే నా కొడుకులు తల పగలగొట్టి పట్టుకుపోతారనేది'' అందరి ఎదురుగానూ. పెద్ద కొడుకు నవ్వి ఊరుకునేవాడు. తింగరిదయినా తల్లి మాటలకు రెండో కొడుకు చాలా అభిజాత్య పడేవాడు. మేనమామా చిన్నాన్నా ''దాన్ని పట్టించుకోకురా చిన్న సన్నాసి రాజూ'' అని నచ్చజెప్పేవారు.

సావిత్రమ్మ సంబంధంతో కలిగిన అనుభవంతో లక్ష్మీ నారాయణ, తతిమ్మా ఇద్దరు చెల్లెళ్ళనీ వంద రకాలుగా ఆరా తీసి మరీ ఓ అయ్య చేతిలో పెట్టాడు. వాళ్ళిద్దరూ పచ్చగానే ఉన్నారు.

'ముండలు-బోళ్ళు' అని తిట్టేది చెల్లెళ్ళని సావిత్రమ్మ. అది తిట్టడం అనడం కూడా సాధ్యం కాదు. అది తిట్టడం అయిన సందర్భాల్లో చెల్లెళ్ళు తనని చూడటం లేదన్న ఫిర్యాదు ఉండేది. నిజమే! ఎంత ప్రేమ ఉన్నా ఆడపిల్లలకి పుట్టింటి వాళ్ళను చూడటం అవుతుందా? అవదూ అవటానికి లేదు. చూసేవాళ్ళు లేరా అంటే ఇంట్లో పప్పులు, ఉప్పులూ కొట్టుకి పంపి, పదో పరకో చేసుకుని, అయిదో పదో పెట్టేవాళ్ళు. సావిత్రమ్మ చెల్లెళ్ళకి అంత చెమా చెమా లేవనలేం గాని అంతపాటి గడుసుతనం లేదనవచ్చు. అన్నగారు అది పెట్టలేదు, ఇది పెట్టలేదని మొగుళ్ళకన్నా ముందే కచ్చా పోసి కలబడిపోవటానికి మాత్రం తయారు.

''అక్కయ్య కొడుకుల్ని తెచ్చి మేపుతున్నావు, మా దగ్గరికొచ్చే సరికి మొదలవుతాయి మూతి విరుపులు..పేద అరుపులూనూ..'' అని వదిన మీద పెట్టి అన్ననీ, అన్న మీద పెట్టి వదిననూ వాళ్ళ ఎదురుగ్గానూ వాళ్ళ వెనకాల చెడతిట్టేవారు.

పదిహేనేళ్ళుగా సావిత్రమ్మ చెమటోడ్చి వంటలవాళ్ళతో వెళ్ళి ఎంతో కొంత తెచ్చింది. అన్న చేతిలో పోసింది. అందులో ఎంతో కొంత తీసుకునేది. అంతా పద్ధతులుగా ఉండే లక్ష్మీ నారాయణ చెల్లెలి కష్టాన్ని తినేసే రకం కాదని అందరికీ తెలుసు గదా- అనుకునేది రాధమ్మ. ఇప్పుడు ఆ సొమ్ము ఎంతో ఏమిటో, ఎవరు ఇవ్వదేలేరో ఏమిటో ఆ లెక్క రాధమ్మకు తెలీదు.

* * *

''ఎంతంటుందీ అత్తయ్య'' అన్నాడు రాజు.

లాప్‌టాప్‌లో పనిచేసుకుంటున్న కొడుకు ఏం విన్నాడో ఏం వినలేదో రాధమ్మకి అర్థంకాలేదు. ఎంతన్నా- అతను ఇచ్చి పారెయ్యగలడని రాధమ్మకి అంచనా వుంది.

అయితే ప్రశ్న అదెంతా అన్నది కాదు.

''అదికాదురా కన్నా'' అంది.

''చెప్పమ్మా''

''ఎంతో నాన్నగారికే తెలుసు''

'' ఆయనేం చెప్పగలరూ''

''నేనడిగాను''

''ఎంతన్నారు''

''పదిరోజులుగా మీ పెద్దత్త వస్తోంది. పోతోంది. ఏదో అంటుంది. ఓ సారి అన్నది ఓ సారి అనదు. ఏంటండీ అని కూర్చోబెట్టి అడిగాను, ఆయనకి బోధపడింది గామోసూ, గుర్రుగా చూశారు. అప్పుడేమన్నారో తెలుసా?''

''ఏమన్నారు''

''బొగ్గులు-బొగ్గులు'' అన్నారు.

''అంటే?''

''ఒకదానికొకటి అంటారు, ఏంటో ఆయన బొగ్గులు అన్నప్పుడల్లా మీ అత్త బుట్ట బోర్లిం చేశాడు అంటుంది'' రాధమ్మ. ఆమె మాట పూర్తవ కుండానే రాజు అన్నాడు.

''ఆవిడకి మతి ఏనాడూ లేదు. ఈయనకి ఈనాడు లేదు. ఆయనేం చెబుతాడు, ఈవిడేం చెబుతుంది. ఎంతో కొంత పారేద్దాం. కాదంటే ఎంతంటే అంత పారేద్దాం. నువ్వు తల బద్దలు కొట్టుకోకమ్మ''

''అది కాదురా'' అంది మళ్ళీ.

'' ఏంటమ్మా..''అన్నాడు.

కొంత సేపటి వరకూ తల్లి నుంచి మాట రాలేదు. అది గమనించాక రాజు లాప్‌టాప్ క్రింద పెట్టి అమ్మ వైపు చూశాడు.

పీట మీద కూర్చున్న రాధమ్మ నేల మీద వేలితో ఏదో గీస్తోంది. అమ్మ ఎంత సౌమ్యమైనదో తనవాళ్ళూ, పరాయివాళ్ళూ అని లేకుండా అందరినీ ఎంతగా ఆదరిస్తోందో రాజుకి బాగా తెలుసు. ఆడపడుచుకి ఇవ్వ వలసిన సొమ్ము గురించి ఆమె లెక్కలు వెయ్యదని, చేస్తే గిస్తే ఆ పని తండ్రి చేయొచ్చని రాజు హృదయానికి తెలుసు.

అయితే ఆమె అంత తీవ్రంగా దేని గురించి ఆలోచిస్తున్నట్టు?

లేచి ఆమె దగ్గరగా వచ్చి పక్కనే కూర్చుని భుజం మీద చెయ్యేసి ''ఏంటమ్మా'' అన్నాడు. ఎముకల గూడు లాంటి ఆమె శరీరం బిడ్డ స్పర్శకి కదిలింది.

''అది కాదురా''

''చెప్పమ్మా''

''నవ్వకేం...''

''ఎందుకు నవ్వుతానూ...చెప్పవే''

''నువ్వన్నది నిజమే, అత్తయ్యకి ఏనాడు మతి లేదు. ఇహ ఇప్పుడు నాన్నగారి సంగతి సరేసరి. ఒంటి మీద బట్టే తెలియడం లేదు. అయినా డబ్బు సంగతి వచ్చే సరికి ఆయన గుర్రుమంటాడు. ఈవిడ కస్సుమంటుంది. ఆయన బొగ్గులంటాడు. ఈవిడ బుట్ట బోర్లించాడు అంటుంది. ఎందుకలా అంటార్రా?''

రాజు ఆలోచనలో పడ్డాడు.

''ఉన్న మతిని డబ్బు పోగొడుతుందని తెలుసు గాని, లేని మతిని కూడా తెచ్చిపెడుతుందే మోనమ్మా'' అన్నాడు ఆలోచనలలో.

★